అందమైన భార్య కావాలా? లేక.... అందమైన జీవితం కావాలా?

మధ్యాహ్నం పోస్టులోవచ్చిన ఉత్తరం చదివిన దగ్గరనుంచి మనసు వశం తప్పినట్లయింది శ్రీహరికి. గుండెలు ఏదో బరువు మోస్తున్నట్లుగా వున్నాయి.

సాయంత్రం ఆఫీసునుంచి కాళ్ళీడ్చుకొంటూ తిన్నగా పార్కులోకి ప్రవేశించి, ఓ మూల బెంచీని ఆశ్రయించేడు. జేబునుంచి కవరుతీసి మడతలు విప్పేడు.

బావా!

ఎప్పుడో మరుపుకొచ్చిన నీ మరదలు ఇప్పుడు జ్ఞాపకాల పుటలు తీసి నీ ముందు కొస్తోంది నువ్వు మరచిపోయినా నిన్ను తలుచుకోని రోజు లేదు. ఇన్నేళ్ళతర్వాత అడుగుతున్నాను. ఒక్కసారి నిన్ను చూడాలనే నా కోరికను దయవుంచి, మన్నించి రాగలవా? పాతికేళ్ళకే నూరేళ్ళు నింపుకోబోతున్న ఈ అంతిమ ఘడియల్లో నువ్వొస్తావనే నమ్మకంతో ఎదురుచూస్తూ యముడితో పోరాడి అయినా ఈ గుండెలో దీపం ఆరిపోకుండా చూస్తాను. అక్కయ్యకు క్షమాపణలతో—

నీ మరదలు
సీత.

హృదయాన్ని ఎవరో నొక్కిపట్టినట్లుగా వుంది.

మెళ్ళో పసుపుతాడు పడకుండానే, ఒక బిడ్డ తల్లి కాకుండానే సీతకు వచ్చిన ప్రమాదం ఏమిటో అర్థం కాలేదు.

ఆ పిల్ల రూపు ఇంకా కళ్ళముందు కదలాడుతూనే వుంది చూసి ఆరేళ్ళు అవుతోన్నా.

* * *

కాలేజీ చదువుకు వీడ్కోలు చెప్పి, ఇంటికొచ్చి, తోచక తిరుగుతోన్న తనతో అమ్మ అంది. "ఒకసారి మామయ్యావాళ్ళ వూరు వెళ్ళి రాకూడదూ? మొన్న వచ్చినప్పుడు నిన్ను పంపమని చెప్పి వెళ్ళేడు కూడా."

అర్జంటుగా ప్రయాణం అయిపోయేడు.

గోదావరి తీరం, కొబ్బరితోటలు, లాంచీలో ప్రయాణం— తనకు గొప్ప ఉత్సాహాన్ని తెచ్చిపెడతాయి. పైగా రమణ ఉంటే మరి చెప్పనక్కర్లేదు సరదాలకు!

తను ఎప్పుడు వెళ్ళినా బ్రహ్మాండమైన స్వాగతాలు ఎదురవుతాయి అక్కడ!

మామయ్య హడావుడికి అంతువుండదు.

అత్తయ్య మరీ అపురూపంగా చూస్తుంది.

రమణ సరేసరి- అక్కడ వున్నన్ని రోజులూ తనవెంటే!

ఆ సాయంత్రం పెరట్లో నూతిదగ్గర స్నానంచేస్తూ, ఇంటిచుట్టూవున్న విశాలమైన ఆవరణలో వేసిన రకరకాల మొక్కలను శ్రద్ధగా చూస్తూ, ఒకచోట వులిక్కిపడినట్లుగా అయి చూపులు నిలిపేడు.

గుబురుగా విస్తరించుకుపోయిన మల్లెపొద దగ్గర పూల సజ్జతో నిలబడి వుంది ఒకతె!

ఆ పిల్లను చూడగానే అప్రయత్నంగా నవ్వొచ్చినట్లయింది అతడికి.

జరీ పువ్వుల తెల్లటి చీర, జాకెట్టులో ఆమె ఒంటి రంగు మరింత నలుపుగా నిగనిగలాడుతోంది. బిగించి వేసుకొన్న జడలో పెద్ద కనకాంబరాల మాల. మెడ నిండుగా అలంకరించుకొన్న నగలమీద సంధ్య కిరణాలు వాలి తళుక్కుమనిపించేయి క్షణం.

అతడిని చూసి ఆమె సిగ్గుగా నవ్వినట్లనిపించడంతో ఆశ్చర్యపోతూ తువ్వాలు తీసుకొచ్చిన రమణతో అన్నాడు

"ఎవరోయ్ ఆ అమ్మాయి?"


రమణ పకపకమంటూ వెర్రి నవ్వు నవ్వి, ఏదో ఉద్ధరించిన ఫోజులో "మన సీతరా!" అన్నాడు.

అద్భుతాన్ని చూసినవాడిలా కనుబొమలు ఎగరేసి, "వాటె వండర్? మొన్నీమధ్య రెండు పిలకలతో, పొట్టిగౌన్లతో తిరిగినట్లుందీ నల్ల పిల్ల!" అన్నాడు.

"సరేలే. ఆడపిల్లలు ఎంతలో ఎదిగిపోతారు? అప్పటి రంగు కూడా విరిగి కొంచెం ఛాయ కొచ్చింది ఇప్పుడు."

నవ్వుకొన్నాడు శ్రీహరి, అన్నగారి ఆప్యాయతకు.

ఆ తర్వాత వున్న వారం రోజులు ఎవరో ఒకళ్లు, ఏదో ఒక పనిమీద సీతను తనముందుకు పిలిపిస్తూనే వున్నారు. తళుక్కుమనే బట్టల్లో, నగల్లో మరింతనల్లగా మెరిసిపోతూ సిగ్గుతో కుదించుకుపోతూ, భారమైన కనురెప్పల్ని ఓరగా పైకెత్తి చూసీ చూడనట్లు చూసేది. ఆ పిల్లనలా ఇబ్బందిపెట్టడం బాగులేదనిపించి, తనూ పట్టించుకోనట్లు ప్రవర్తించేడు అక్కడ వున్నన్నిరోజులూ.



ప్రకృతి ధరించిన పల్చని నల్లని మేలి ముసుగు మీద తళుకుల్లా పార్కులో అక్కడక్కడ దీపాలు వెలిగేయి. శ్రీహరి చలనం తెచ్చుకొని లేచేడు.


గేటు తీసికొని లోపలకు ప్రవేశిస్తూనే వింధ్య కోసం చూసేడు. ఆమె పాదాల చిరుమువ్వల సవ్వడి, గాజుల గలగల సందడిలేక ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

పడక గదిలో ప్రబంధ నాయికిలా కూర్చొని తీక్షణ వీక్షణాలతో విల్లంబులు సంధిస్తోన్న ఆమెను చూడగానే, చప్పున ఏదో గుర్తుకు వచ్చినట్లయి కలవరపడి పోయేడు.

"సారీ వింధ్యా....ప్రొద్దుట...."

# మనసు లేఁ(లోని బంధం

## 'సుమ'



"ఇంకేం చెప్పకండి. మన జీవితాలను ముడిపెట్టుకొన్న దౌర్భాగ్యపు రోజు యివాళేనని మీరు మరచిపోయినా నేను మరచిపోలేను. ఎందుకంటారా? నాలో చైతన్యాన్ని, ఉత్సాహాన్ని అణగద్రొక్కే ప్రయత్నం ఆ రోజే మొదలయింది కనుక!"

శ్రీహరి గుండెను ముల్లులా పొడిచింది ఆమె వాక్కు. అయినా చలించకుండా చిరునవ్వుతో దగ్గరకు రాబోయేడు.

చప్పున మంచంమీదనుంచి దిగింది. చేప పిల్లల్లా మిలమిలలాడే ఆమె కళ్ళలో ఎర్రటి జీరలు! ఏ చిత్రకారుడో గీసినట్లున్న అందమైన పెదవులు ముడుచుకోగా మునిపంటి క్రింద నలుగుతోంది క్రింద పెదవి ఎరుపెక్కి. ఎత్తయిన గుండెలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో అదురుతున్నాయి. సృష్టిలో అందాన్ని ప్రోవు చేసి మలిచినట్లున్న ఆమె ఆకృతిలో నిలువెల్లా ఏదో అహం.




రిజిస్ట్రేషన్ ఆర్. ఎం. పి.

బి.ఐ.ఎం.ఎస్. /బి.ఏ.ఎం.ఎస్.

మార్గదర్శక వివరాలకు వ్రాయండి.

REGISTRATION INSTITUTE
(OPP. CHAWLA ELECTRONICS)
D-31, LAXMI NAGAR, DELHI-92

జౌలిక్ లోషన్
గజ్జి తామరలకు పేటెంటు మందు
అన్ని షాపులలోను దొరకును
ORIENTAL CHEMICAL WORKS
RAO (INDORE)

పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించె శ్రేష్టమైన రాళ్ళు లభించును కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

Shree Jagdamba Bhawan
(A. J ) SONEPAT-131001.

మీద పడబోతున్న అతడి చేతిని విసురుగా విదిలించి "ఛీ! ఛీ! నన్ను ముట్టుకోకండి. అసహ్యం వేస్తుంది నాకు. మనసులో లేనిది మాటల్లో ఒలికించాలని చూసే మిమ్మల్ని చూస్తుంటే!" అంటూ చరచరా లోపలకు వెళ్ళిపోయింది.

శ్రీహరి విస్మయంతో చూసి నిట్టూర్చేడు. ఐదేళ్ళుగా అలవాటయిపోయిన తత్వం! ఇవాళ పెళ్ళిరోజని, సాయంత్రం సరదాగా ఎక్కడైనా వెళ్ళిరావాలని ఉదయం అనుకొని—ఇప్పుడిలా తను. ఆ విషయమే మరిచి ఆలస్యంగా ఇల్లు చేరటం. ఆమె దృష్టిలో క్షమించరాని పొరపాటే. ఆమె వేసిన శిక్ష తను అనుభవించవలసిందే! జాబు చూపించి. సీత గురించి చెప్పేస్తే మరో ప్రళయం సృష్టించబడుతుందేమో అనుకొన్నాడు.

ఆ రాత్రి భోజనాలు లేవు. మధ్యన మాటలు లేవు.

ఒకటి రెండుసార్లు అనునయించబోయినా ఛీత్కారంతో విదిలించటంతో ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు.

వివాహం నూరేళ్ళ పంట అంటారు. వింధ్య వింత మనస్తత్వం వలన అనురాగం, అనుభూతి మరచి నూరేళ్ళ నరకం అనుభవిస్తున్నాడు తను. రాజీపడే ధోరణిలోనే మనసును మళ్ళించినా ఆమె అనురాగాన్నే పొందలేకపోతున్నాడు.

తలగడ, దుప్పటి తీసుకొని డాబా మీదకు చేరుకున్నాడు శ్రీహరి.

నిశాకన్య మేలిముసుగులో ప్రశాంతంగా ఒదిగి పడుకొంది ఊరు. కాని తనకు లేదు ఆ శాంతి.

చుక్కలు లెక్కబెడుతూ, గాలి పాడే సంగీతం వింటూ మనసును జోకొడుతున్నా, ఆలోచనలు వదలడం లేదు.

* * *

వారం రోజులు గడిచేక తిరుగు ప్రయాణానికి ముందు మామయ్య అడిగేడు. "సీతెలా వుంది హరీ?"

ఇబ్బందిపడిపోతూ మొహమాటంగా అన్నాడు:

"బాగానే వుంది మామయ్యా!"

"దానికేం తక్కువ? లక్షణంగా ఐదెకరాల మాగాణి, పాతికవేలు రొక్కం, వాళ్ళ నానమ్మ పాతిక కాసుల బంగారం దానికే వున్నాయి. రంగు తక్కువనేగాని గుణం బంగారం. మనసు పాలవెల్లువ. నా కూతురని కాదుగాని...." మామయ్య ఉపోద్ఘాతం చాలాసేపు సీత గుణగణాలను వర్ణిస్తూ సాగిపోయింది.

ఆ మునిమాపు వేళ గుమ్మంలో నిలబడి వింటున్న అత్తయ్య కళ్ళలో మసక చీకట్లను తప్పించే వెలుగు చోటుచేసుకొంది.

ఆ వెనక గదిలో నిలబడి వింటోన్న సీత చీకటి గుహలో చెక్కిన రాతి శిల్పంలా వుంది.

లేగదూడలను పాలకు వదులుతూ, పచ్చగడ్డి వేస్తూ తిరుగుతోన్న రమణ ముఖంలో చిరునవ్వు వెలుగులు

ఇంటికి వచ్చిన తర్వాత అమ్మ తన వెంట తిరుగుతూ ఒకటే ప్రశ్నలు వేస్తుంది. చివరకు మనసులో వున్నది బయటపెట్టింది.

"సీతెలా వుందిరా హరీ?"

"బ్రహ్మాండంగా వుంది. మరింక ఆ రంగు వెలవదు, మాయదు. పాపం. మామయ్య కూడా నీలాగే అడిగేడమ్మా!"

పార్వతమ్మ నొచ్చుకొంటూ. "మరీ అనాకారి కాదుగా? కొంచెం రంగు తక్కువ అంతే! ఎరుపైతే కొరుక్కు తింటామా? నలుపైతే నాణ్యం తక్కువా ఏమిటి?" అంటూ "మామయ్య ఆశలన్నీ నీమీదే పెట్టుకొన్నాడురా హరీ! రంగు తక్కువైనా దాని గుణం నాకు తెలుసు." అంది.

మండిపడ్డాడు తను. "మీ అందరి మనసులో ఈ ఆలోచన ఉన్నదన్నమాట. మధ్యన నన్ను వెర్రివాడిని చేసి ఆడించేరు. నీకూ ఆ ఆలోచన ఉన్నదని తెలిస్తే అసలు వెళ్ళేవాడినే కానమ్మా. ఆ పిల్లను చేసుకొనేకంటే మెడకో వురితాడు బిగించుకొంటే...."

"హరీ!" తీక్షణంగా చూస్తూ పిలిచింది. "అంతంత మాటలెందుకు? ఇష్టంలేదని ఒక్కమాట చెప్పరాదూ? తోడబుట్టినవాడు కనుక నామీద ఆశ పెట్టుకొన్నాడు. అంతమాత్రాన నీ మెడకు బలవంతాన కట్టాలని నా అభిమతం కాదు. నీకిష్టమైన సంబంధమే చేసుకో. వన్నె తక్కువయినా అది మెట్టినింటికి వన్నె తీసుకురాగలదు. రంగు తక్కువైనా గుణం తక్కువ కాదని నాకు తెలుసు. అయినా నీకు అందాల మకరందాలు తప్ప మనసు విలువేం తెలుసు?" అంటూ లోపలకు వెళ్ళిపోయిన తల్లిని చూస్తూ కొద్దిసేపు ఆలోచనగా నిలబడి, అంతలోనే తల విదిలించుకొని బయటకు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత దూరపు బంధువు● పెళ్ళిలో అందాల హరివిల్లులాంటి వింధ్యను చూడటం, అనుకున్నదంతా క● సొచ్చి వింధ్య తన ఇల్లాలు కావడం జరిగిపోయేయి.

వివాహానికి రమణ ఒక్కడే వచ్చేడు. మామయ్య పోయినప్పుడు తల్లితో తనూ

బయలుదేరేదు కాని ఆమె తనను వారించి ఒక్కతే వెళ్ళివచ్చింది. మరింకెప్పుడూ ఆ వూరు వెళ్ళే అవసరం రాలేదు.

రమణ భోపాల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

ఆ ఊళ్ళో అత్తయ్య, సీత మటుకే వున్నారని తెలుసు.

ఇన్నేళ్ళతర్వాత సీతనుంచి యిటువంటి జాబు రావటం ఆశ్చర్యంగానూ, ఆవేదనగానూ వుంది. వెళ్ళవలసిన ధర్మం యెంతైనా వుంది. వింధ్యకుచెప్పి వెళ్ళటం కంటె, వెళ్ళివచ్చేక నచ్చజెప్పటం తేలిక అనిపించింది.

ప్రొద్దుట ప్రయాణం అయేక వింధ్యతో అన్నాడు. "అత్యవసరంగా వూరు వెళ్ళవలసిన పని వచ్చింది వింధ్యా. వచ్చేక నీకు అన్నీ వివరంగా చెబుతాను."

"అక్కర్లేదు. మీ రెక్కడకు వెళతారో, ఎక్కడ ఊరేగుతారో నా కనవసరం" అంటూ గిరుక్కున తిరిగి లోపలకు వెళ్ళిపోయింది.

పలవరిస్తున్న కొబ్బరిచెట్లు, అలలు రేపుతున్న గోదావరి గతాన్ని తలపుకుచ్చినట్లనిపించింది. లాంచీలో ప్రయాణం ఇదివరకులా అద్భుతంగా లేదు. తననెంతో ఆప్యాయంగా చూసిన మామయ్య ఈ లోకంలో లేడు, రమణ దగ్గర లేడు.

విశాలమైన మండువాఇల్లు కళావైభవాన్ని కోల్పోయి వెలవెలపోతోంది. ఆవరణ నిండా కళకళలాడుతూ కనిపించే పచ్చని చెట్లు మచ్చుకైనా లేవు. పశువుల కొట్టం జీర్ణావస్థలో రేపో, మాపో కూలిపోవటానికి సిద్ధంగా వుంది. మగదక్షత లేని ఇల్లాయె!

ఎవరూ కనిపించకపోవడంతో వసారాలో చెప్పులు విడిచి లోపలకు నడిచేడు. ఏవో మాటలు వినిపించేయి.

"బావొస్తాడేమోనమ్మా. ఈ పూట! వంటంతా నేనే చేస్తాను. బంగాళాదుంపల కూర, ఆవపెట్టిన అనపకాయ పులుసు బావకు ఎంత యిష్టమో! కొబ్బరి బొబ్బట్లూనూ!"

"ఏమోనమ్మా, అవన్నీ నీకింకా గుర్తున్నాయా! అతగాదొచ్చినపుడు చేద్దువుగానిలే."

"తప్పకుండా వస్తాడు చూడమ్మా!"

"అత్తయ్యా." ఉలిక్కిపడ్డారు తల్లీ, కూతుళ్ళు.

సీత కళ్ళల్లో వెలుగు. తులశమ్మ కళ్ళల్లో నీళ్ళు.

"చూసేవా అమ్మా, నేనిప్పుడే అంటున్నానా బావొస్తాడని!"





Sankar Ads





నూతనయవ్వనం పొందండి: సంతానవంతులు కండి! చర్మవ్యాధులనుండి విముక్తులు కండి!

హస్తప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టు ద్వారా చికిత్స లేదు ప్రతి ఆదివారము భీమవరం షణ్ముఖి లాడ్జి నందు ఉదయం గం. 9 నుండి సాయంత్రం 6-30 వరకు క్యాంపు గలదు

డా|| డి. మార్కండేయులు, ఆయుర్వేద విశా.

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కు రోడ్డు, గుడివాడ-521 301

ఫోన్స్: 522 & 540 SHAH ADS



సీతను చూసేక శ్రీహరికి కొంత మనస్తాపం తీరినట్లయింది. పలకరింపులు. పరామర్శలు అయ్యేయి.

సీత చిక్కినట్లు కనిపిస్తున్నా కులాసగానే తిరుగుతోంది.

అతడి రాకతో పూర్వపు హడావుడి. సందడి తిరిగొచ్చినట్లయింది ఆ యింట్లో.

టిఫిన్. కాఫీ తీసుకువచ్చింది సీత. పూర్వంలా బిడియపడుతూ. సిగ్గుపడుతూ వొదిగి నిలబడటంలేదు. స్వచ్ఛంగా మాట్లాడుతోంది. చక్కగా నవ్వుతోంది. "అక్కయ్యను తీసుకురాకపోయావా బావా?" అంది.

"ఏదీ. నీ లెటర్ చూసేక నాకే కాళ్ళాడలేదు. ఎలా వున్నావో అని కంగారు పడ్డాను. ఇంక మీ అక్కయ్యకేం చెప్పను?"




నవ్వింది పల్చగా. కొంచెంసేపు కబుర్లు అయ్యేక వంట చేసేందుకు లోపలకు వెళ్ళింది. తనముందు కొన్ని పుస్తకాలు పెట్టి.

తులశమ్మ వచ్చి దగ్గరగా కూర్చున్న తర్వాత అడిగేడు.

"సీత కేమిటత్తయ్యా? ఒంట్లో కులాసాగా లేదా?"

ఒక్కసారిగా బావురుమంటూ కొంగులో ముఖం దాచుకొంది. "ఏం చెప్పను హరీ? దాని రాత ఎవరితో చెప్పుకొన్నా ఏం లాభం? దాని బతుక్కి ఏదీ లేకుండానే నూరేళ్ళు నిండుకొస్తున్నాయి."

నిరుత్తరుడయేడు.

"ఏమిటత్తయ్యా? సీత కేమైంది?"

"గుండె జబ్బుతో ఈ మధ్య చాలా ప్రమాదం చేసింది. మళ్ళీ ఈసారి నొప్పి వస్తే బతకటం కష్టం అన్నారు డాక్టర్లు?"

హృదయం కలుక్కుమంది.

"సీతకీ సంగతి తెలుసునా?"

"ఎంత జాగ్రత్తపడినా తెలియకుండా ఆగలేదు నాయనా! అప్పటినుంచి వెర్రి సంతోషంతో తిరుగుతోంది. రమణ రాయవెల్లూరు తీసుకువెళతానన్నాడు. రానని మొండికేసింది. వాడు సెలవుల్లేక మొన్ననే తిరిగి వెళ్ళిపోయేడు. నీవైనా చెప్పిచూడు హరీ!"

గుండెలమీద మంచు ముక్క పెట్టి నొక్కినట్లుగా వుంది అతడికి.

"బావను చూడాలని వుందమ్మా అంటే నీకు జాబు వ్రాయమన్నాను. నిన్ను తప్ప మరెవరినీ చేసుకోనంటూ భీష్మించి ఎన్ని సంబంధాలు చూసినా వద్దు పొమ్మంది. ఈ జన్మకు పెళ్ళంటూ లేదని నీ వివాహం అయేక ఖచ్చితంగా చెప్పేసింది."

విలవిలలాడినట్లయింది శ్రీహరి మనసు.

"ఎందుకమ్మా ఆ సోదంతా? కాస్సేపు మంచి మాటలు చెప్పక?" లోపలనుంచి వస్తూ అంది సీత.

తులశమ్మ కళ్ళు తుడుచుకొంది.

సీత ముఖంలో విచారం మచ్చుకైనా లేదు. ఆనందంగా తిరుగుతూ. నవ్వుతూ కబుర్లు చెబుతోంది.

మధ్యాహ్నం విందు భోజనం. పడక.

సాయంత్రం కొంచెంసేపు గోదావరి ఒడ్డున తిరిగివచ్చేడు. పక్కన రమణ లేకపోవటం వెలితిగా వుంది.

సీతగురించి ఆలోచనలు అతడిని కృంగదీసినట్లు చేసేయి. రాయవెల్లూరు తీసుకువెళ్ళే ఏర్పాటు గురించి మాట్లాడేడు సీతతో.

జాలిగా నవ్వింది. "ఎందుకంత వృధా ప్రయాస? మొన్ననే చచ్చి బ్రతికినట్లయింది. మళ్ళీ బ్రతకటంకంటే చావే నయం బావా! తనంత తానొచ్చే వరం లాంటిది చావు. బ్రతికి పొందేది, సాధించేది ఏం వుందికనుక?"

"అక్కడకు వెళ్ళి కొన్నాళ్ళువుంటే నయం అయిపోతుంది నీకు. తర్వాత అందరి ఆడపిల్లల్లాగే చక్కగా మంచి వరుడిని చూసి. పెళ్ళి చేసుకొని...."

మళ్ళీ నవ్వు. "ఎంత ఆశ? అందం లేని ఆడపిల్లకు తాహతుకుమించిన కోరిక అది!"

సిగ్గుతో తల దించుకొన్నాడు శ్రీహరి.

సీతనుకాదని తాను ఏం సుఖపడ్డాడు? అమ్మ చెప్పినట్లు అందాల మకరందాల వెంట పరుగుతీసి మంచిముత్యంలాంటి మనసును చేజార్చుకొన్నాడు.

కొబ్బరిచెట్ల కింద పక్క వేసింది.

చల్లగాలికి హాయిగా నిద్రపడుతోన్న వేళ పాదాల మీద ఏదో చల్లని స్పర్శ. కలగా అనిపించి తన్మయావస్థలో వుండిపోయేడు.

చల్లని తడి తగిలేటప్పటికి ఉలిక్కిపడి లేచేడు.

కాళ్ళవైపు ఎదురుగా కింద కూర్చుని సీత.

వెన్నెల వెలుగులో సీత చెంపల మీద కన్నీటి జాలు.

"ఏమిటి సీతా? ఎందుకేడుస్తున్నావు?" అంటూ ముందుకు ఒంగేడు.

ఎగసివస్తోన్న దుఃఖంతో ఆమె గుండెలు అదురుతున్నాయి.

"నీకేం భయంలేదు సీతా! తగ్గిపోతుందిగా? రమణ. నేను నిన్ను రాయవెల్లూరు తీసుకువెళ్ళి...."

"వద్దు వద్దు. నాకు చావంటే భయం లేదు. కాని నాకు ఒక్క కోరిక మిగిలి వుంది బావా! అది నీవల్లనే తీరాలి."

"ఏమిటది చెప్పు సీతా!" లాలనగా అడిగేడు.

ఆశగా తలెత్తి చూసింది. కొబ్బరి ఆకుల మాటునుంచి పడిన వెన్నెల కిరణాల్లో ఆమె కళ్ళలో తడి మెరిసింది.

"చెప్పనా! ఊహ తెలిసినప్పటినుంచి అమ్మ నాన్న, ఇరుగుపొరుగు అందరూ, 'బావ నీ మొగుడే' అంటూ నిన్ను నాలో ప్రతిష్టింపజేసేరు. వయసుతోపాటు నువ్వు నాలో మొక్కలా ఎదిగి, మహావృక్షమై విస్తరించుకుపోయేవు. బావగా కాదు. రేపు కాబోయే భర్తగా వూహించుకొని, నా హృదయాన్ని దోసిలి పట్టి నీకు అర్పించే రోజు కోసం ఎదురుచూసేను.

"కాని నాకా అర్హత లేదని చాలా ఆలస్యంగా తెలుసుకొన్నాను. తెలుసుకొన్న తర్వాత నా మనస్సును వెనక్కి తీసుకోవటం నా వశం కాలేదు. మరొకరికి నన్ను అర్పించుకోవటం నాకు సాధ్యంకాదని తెలుసుకొన్నాను" ఆగింది వూపిరి తీసుకొంటూ.

"క్షమించు సీతా" చాలా నెమ్మదిగా పలికేడు శ్రీహరి. అతడికళ్ళలో నీరు చిప్పిల్లింది. గొంతు వణికినట్లయింది.

"కాని నన్నొక తీరనికోరిక బాధిస్తోంది బావా! మరింకెన్నోరోజులు బ్రతకను. ఈసారి నొప్పితో ఈ జీవితం అంతం అయిపోతుంది. అందుకే నిన్ను వేడుకొంటాను. పసుపు కుంకుమతో పోవాలనే నా కోరిక నీవల్లనే తీరుతుంది. ఇదిగో ఈ పసుపుతాడుతో నా మెళ్లో మూడుముళ్లు వెయ్యి బావా! తృప్తితో, నా కోరిక తీరిందన్న సంతోషంతో చచ్చిపోతాను. ఇది మనిద్దరిమధ్యనే వుంటుంది. ఎవరికీ తెలిసే అవకాశం ఇవ్వను. నీకేవిధంగానూ అడ్డు రాను" ఆమెచేతిలో పసుపుకొమ్ముకట్టిన పసుపుదారం వుంది.

అదిరి పడ్డాడు శ్రీహరి. ఆమె కోరికకు నివ్వెరపోయేడు.

వింధ్య కళ్ళముందు మెదిలింది. సీత కోసం వింధ్యకు అన్యాయం చేయనా? అగ్నిసాక్షిగా పెళ్ళాడి, అర్ధభాగం పంచుకొని. సీతమెళ్ళో తాళికట్టటం ఎంతవరకు న్యాయం?

సీత చావుబ్రతుకుల్లో వుండనీ, ఆమె తృప్తికోసమని సీత పని చెయ్యలేడు. వింధ్యకు అన్యాయం చెయ్యలేడు.

ఆశ నిండిన కళ్ళతో శ్రీహరి కళ్ళలోకి చూస్తుంది సీత.

గుండె చిక్కబట్టుకొని నెమ్మదిగా అన్నాడు. "క్షమించు సీతా! నీ కోర్కె తీర్చలేను. మీ అక్కయ్యకు అన్యాయం చెయ్యలేను."

సీత ప్రాణ్ణుడిపోయినట్లు చూసి, తర్వాత నవ్వుతూ అంది "చూసేవా? నా కోరికలన్నీ ఎంత నిష్ప్రయోజనమైనవో! ఈ చివరి కోర్కె తీరుతుందన్న వెర్రి నమ్మకంతో నీకు జాబు వ్రాసేను. జీవితంలో అన్నీ పరాజయాలే. మృత్యువుతోనే నా కోర్కెలు తీరుతాయేమో! నువ్వు కాదన్నా నా మనసులో నిండుగా వున్న నీ రూపాన్ని తుడిచివేయలేవుగా! అది చాలు ఈ జన్మకు" అంటూ లేచి అతడి పాదాలు కనుల కద్దుకొని లోపలకు వెళ్ళిపోయింది.

మరిక ఆ రాత్రి శ్రీహరికి నిద్రలేదు. గుండెలు మెలిపెడుతోన్న బాధ. క్షణం సేపు లోపలకు వెళ్ళి సీత కోర్కె తీర్చుదామా అనిపిస్తుంది. అంతలోనే వింధ్య రూపు కళ్ళముందు!

పాలవెల్లువలాంటి సీత హృదయాన్ని తనే దూరం చేసుకొని, ఇప్పుడు వగచి ప్రయోజనం ఏమిటి? వింధ్యకు అన్యాయం చెయ్యటంతప్పు! తెల్లవారేక సీత కనిపించలేదు.

తులశమ్మను అడిగేడు.


"లోపల వుంది నాయనా! ప్రొద్దుట నుంచి బావున్నట్లు లేదు మళ్ళీ."

లోపలకు వెళ్ళి పిలిచేడు.

తలెత్తిచూసి నవ్వింది. ఆ నవ్వు కన్నీళ్ళతో కొట్టినట్లుగా వుంది. "రమణకు లెటరు వ్రాస్తున్నాను. వాడొచ్చేక రాయవెల్లూరు తీసుకువెళ్ళాలి నిన్ను. ఒక నెల రోజుల్లో నీ ఆరోగ్యం బాగుపడిపోతుంది సీతా!"

"అంత శ్రమ ఎందుకులే బావా!"

ఆ ఉదయం ప్రయాణం అయినవచ్చే వాడు ఆమెకు మళ్ళీ క్షమాపణ చెప్పి.




కన్నీళ్ళు నిగ్రహించుకొంటూ తనకు వీడ్కోలు చెప్పిన సీత రూపమే కళ్ళ ముందున్నది.

బరువెక్కిన హృదయంతో ఇంటికి వచ్చేసరికి తాళం కప్ప ఎదురయింది.

పక్కింటిపాప పరుగున వచ్చి "ఆంటీ వూరెళ్ళింది. ఈ తాళం మీ కిమ్మంది" అంటూ చెప్పింది.

కోపంతో పుట్టింటికి వెళ్ళిపోయిందేమోననుకొని, జాలిగా నవ్వుకొన్నాడు.

తాళంతీసి లోపలకు ప్రవేశించి, భారంగా మంచంమీద వాలబోతూ టేబిలు మీదకు చూసేడు.

పేపరు వెయిట్‌కింద గులాబీరంగు కాగితం రెపరెపలాడుతూ కనిపించింది. ఆ ప్రక్కనున్న మరో వస్తువును చూసి పామును చూసినట్లుగా బెదిరిపోయేడు. భయంతో గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి. చెమట్లుపడుతోండగా త్వర త్వరగా చదువుకొన్నాడు.

శ్రీహరిగారికి,

నిన్నటి మీప్రయాణం కారణం తెలుసుకొన్నాను. మీరు ప్యాంటుకు తగిలించి వెళ్ళిన షర్టుజేబులోని ఉత్తరం నాకంతా చెప్పింది. ఇన్నాళ్ళ మీ విముఖత్వానికి కారణం ఆలస్యంగా తెలుసుకొన్నా మంచిదే అయింది.

మనసొక చోట, మనుగడ వేరొకచోట మీకు చెల్లుతుందేమోగాని, నాకు సాధ్యం కాదు. కలవని మనసులను, తాళికట్టి పడవేస్తుందనుకోవటం వెర్రితనం. మనసులో లేని బాంధవ్యం మాంగల్యంలో వుంటుందనుకోవటం ఉత్త భ్రమ. అందుకే మీరు కట్టిన ఈ ప్రయోజనం లేని తాళి మీకే ఇచ్చి వెళ్ళిపోతాను.

ఇట్లు,

—వింధ్య